సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 3 । మే । 2024

I



ఓట్ల వేటకు ఎండ దెబ్బ
లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. అయితే అభ్యర్థుల ఓట్ల వేటపై భానుడు ప్రభావం చూపుతున్నాడు. - IIలో



బలోపేతం చేయాలి
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. - IIIలో



వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా కోడ్ అమలు

భువనగిరి క్రైం : ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు డీసీపీ రాజేశ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం 19 మందిని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. అలాగే అక్రమ మద్యం రూ.13,48,661 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

సోమ్లానాయక్‌కు సన్మానం



పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమ్లానాయక్‌ను సన్మానిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

భువనగిరి రూరల్ : మండలంలోని ఆకుతోట బాయికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమ్లానాయక్‌ని గురువారం లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్‌నాయక్ మాట్లాడుతూ దేశంలోనే మొదటి సారిగా బంజారా బిడ్డకు పద్మశ్రీ అవార్డు రావడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర యూత్ విభాగం ప్రెసిడెంట్ ధీరావత్ రవినాయక్, మాలునాయక్, మోతిలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దినసరి కూలి రూ.300 గిట్టుబాటయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కృష్ణన్

మోత్కూరు : ఉపాధిహామీ కూలీలకు దినసరి కూలీ రూ.300 పడేలా చూడాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సూచించారు. గురువారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమై ఉపాధి పనులపై సమీక్షించారు. పని ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు మనోహర్‌రెడ్డి, శంకరయ్య, దేవకి, ఎంపీఓలు రవూఫ్‌అలీ పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



గజ వాహనసేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో దగా!

'ఎ' గ్రేడ్ వడ్లను మిల్లుల వద్ద 'బి' గ్రేడ్ కింద నిర్ధారణ

- తరుగు పేరుతో బస్తాకు 5 కిలోలు కోత
- వెయిటింగ్ చార్జీల పేరున ఐదు రూపాయలు వసూలు
- బిహార్ కూలీల పేరున రూ.4 కమీషన్
- కొనుగోలు కేంద్రాల్లోనూ అదనంగా 2 కిలోలు తూకం
- లబోదిబోమంటున్న రైతులు



బొమ్మలరామారంలోని కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం



ఈ రైతు పేరు రవి. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల పరిధి సిద్దాపురంలో సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేశాడు. 15 రోజుల క్రితం సిద్దాపురం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోశాడు. ఇప్పటి వరకు తూకం వేయలేదు. ఏఈఓ ధాన్యాన్ని పరిశీలించి ఏ గ్రేడ్‌గా సర్టిఫై చేశారు. అయితే కొనుగోలు కేంద్రం ఇంచార్జి సేంద్రియ పద్ధతుల్లో పండించిన ధాన్యం అయితే మాకేంటి.. బిగ్రేడ్ రకం కింద ఇస్తేనే తీసుకుంటామని కొర్రీలు పెడుతున్నట్లు రైతు వాపోయాడు.

కొనుగోలు కేంద్రాలు	కొనుగోలు చేసిన వడ్లు
323	1,33,235 మెట్రిక్ టన్నులు
మిల్లులు తరలించింది	**తరలించాల్సింది**
1,04,477 మెట్రిక్ టన్నులు	1,23,240 మెట్రిక్ టన్నులు

సాక్షి, యాదాద్రి : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లిన రైతులు దగా పడుతున్నారు. కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై అన్నదాతను దోచుకుంటున్నారు. ఒక్కో బస్తాకు 40 కిలోల వడ్లు కాంటా వేయాల్సి ఉండగా.. తాలు, తేమ పేరిట అదనంగా మరో రెండు కిలోలు సేకరిస్తున్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తర్వాత అక్కడా మిల్లర్లు మెలిక పెడుతున్నారు. ధాన్యం నాణ్యతగా లేదని, మిల్లింగ్ చేయలేమని తిరస్కరిస్తున్నారు.

అన్ని చార్జీలు రైతుపైనే.. కరువు పరిస్థితుల కారణంగా యాసంగిలో చేతికొచ్చిన కొద్దిపాటి పంటను అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం కాంటా వేయకపోగా.. కాంటా వేసిన తర్వాత అన్ని చార్జీలు తమ నుంచే వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్‌గా నిర్ధారించి మిల్లులకు తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు కొర్రీలు పెట్టి బిగ్రేడ్‌గా పరిగణిస్తున్నారు. లేనిపక్షంలో దిగుమతి చేసుకోవడానికి తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా లారీ డ్రైవర్లు రైతుల వద్ద వెయిటింగ్ చార్జీ కింద బస్తాకు రూ.5 వసూలు చేస్తున్నారు. హమాలీలు వసూళ్లకు పాల్పడుతున్నారు. కొందరు మేస్త్రీలు హమాలీలను బిహార్ నుంచి తీసుకువచ్చామని బస్తాకు రూ.4 చొప్పున కమీషన్ తీసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లోనూ తాలు, తేమ, ఇతర కారణాలు సాకుగా చూపి అదనంగా రెండు కిలోలు తూకం వేస్తున్నారు. కేంద్రాల్లో జరుగుతన్న అవకతవకలను నిరసిస్తూ రెండు రోజుల క్రితం కలెక్టరేట్ ఎదుట వలిగొండ మండల రైతులు ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేశారు.

కొనుగోళ్లలోనూ జాప్యం

మరోవైపు ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. లారీల కొరత కారణంగా తూకం వేసిన ధాన్యం ఏరోజుకారోజు మిల్లులకు తరలించలేకపోతున్నారు. దీంతో కేంద్రాల్లోనే రోజుల తరబడి ధాన్యం మూలుగుతోంది. సరిపడా గోనె సంచులు కూడా లేకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం పెద్ద ఎత్తున పేరుకుపోయింది. ఇది కూడా కొనుగోళ్ల జాప్యానికి కారణమవుతోంది.



వలిగొండ మండలం ఏదుల్లగూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు

ఖర్చులు మీద పడుతున్నాయి



మూడు ఎకరాల్లో వరి వేశాం. 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి రోజూ ఎండబెడుతున్నాం. తూకం కోసం నిరీక్షిస్తున్నాం. లారీలు ఆలస్యంగా వస్తుండడంతో సకాలంలో తూకాలు కావడం లేదు. ధాన్యాన్ని బస్తాల్లో నింపి ఉంచడంతో వెయిట్ లాస్ కింద 40 కిలోల బస్తాకు అర కిలో తరుగు తీస్తున్నారు. దీంతో మాకు అదనపు ఖర్చులు మీద పడుతున్నాయి.

–గోధుమ లక్ష్మి, వంగపల్లి, యాదగిరిగుట్ట

సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే



సెక్టార్ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని, పోలింగ్‌కు సంబంధించిన ప్రతి ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జండగే సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులకు పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పోలింగ్ విధులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. భువనగిరి, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 72 రూట్లకు 72 మంది సెక్టార్ అధికారులను నియమించామని, వీరంతా తమ పరిధిలోని రూట్ మ్యాపులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో శాంతిభద్రతలు తలెత్తిన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు చర్యలు తీసుకోవాలని, వెబ్ క్యాస్టింగ్ చేయాలని కోరారు. పోల్ చిట్టీలు వంద శాతం పంపిణీ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఈవీఎంలలో సమస్య తలెతినట్లయితే ప్రత్యామ్నాయంగా అదనపు ఈవీఎంలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పోలింగుకు 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహించాలని, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 7 గంటలకే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు గంగాధర్, అమరేందర్ పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచాలి

సాక్షి,యాదాద్రి : ఓటింగ్ శాతం పెంపునకు రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వారితో సమావేశం అయ్యారు. ఓటరు జాబితా, పోల్ చిట్టీల పంపిణీ, ఈవీఎంల ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ తదితర విషయాలను వివరించారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 18,80,585 మంది ఓటర్లు ఉన్నారని, అందుకు అనుగుణంగా 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.ఇంటింటికీ పోల్ చిట్టీల పంపిణీ జరుగుతుందని, 8వ తేదీ లోగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. 4 తేదీన ఈవీఎంల రెండవ విడత ర్యాండమైజేషన్, 5న కమీషనింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. 13,213 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోనున్నారని, 656 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించి 3నుంచి 7వ తేదీ వరకు, మునుగోడు, భువనగిరి 4నుంచి 7, నకిరేకల్ 3నుంచి 8, తుంగతుర్తి 4నుంచి 6, ఆలేరు 3 నుంచి 4, జనగామ సంబంధించి 3 నుంచి 5వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మే 13న పోలింగ్ సమయం గంట పాటు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ తదితరులు పాల్గొన్నారు.

4న సీపీఐ సమావేశం

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఈ నెల 4వ తేదీన సీపీఐ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డితో పాటు ఎన్నికల ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొననున్నట్లు వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

4 మండలాల్లో 45 డిగ్రీలకు పైనే..

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- వేడి గాలులకు జనం విలవిల

ఉష్ణోగ్రతలు ఇలా..

మండలం	ఉష్ణోగ్రత
అడ్డగూడూరు	45.5
బుజిలాపురం	45.3
ఆత్మకూర్(ఎం)	45.0
వెల్లంకి	45.0
జనగాం	44.6
మోటకొండూరు	44.1
గుండాల	44.1
చౌటుప్పల్	43.8



భువనగిరిటౌన్ : భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. గురువారం ఒక ప్రాంతం అని లేకుండా జిల్లా అంతటా ఎండ తీవ్రత కనిపించింది. ఉదయం 11నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూడొంతుల మండలాల్లో 42.30 నుంచి 45.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా అడ్డగూడూరులో 45.5, మోత్కూరు మండలం బుజిలాపురం 45.3, ఆత్మకూర్(ఎం), రామన్నపేట మండలం వెల్లంకిలో 45 డిగ్రీల ఎండ కాసింది. మిగతా ప్రాంతాల్లోనూ భానుడు తారెత్తించాడు. వేడిగాలులూ తోడవడంతో ప్రజలు విలవిల్లాడారు. అడ్డగూడూరు, మోత్కూరు, ఆత్మకూర్(ఎం) మండలాలను రెడ్ జోన్‌గా, మిగతా మండలాలను ఆరెంజ్ జోన్‌గా వాతావరణ శాఖ ప్రకటించింది. మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని హెచ్చరించింది.

సెంటిమెంట్ ప్రయత్నాలు పనిచేయవు

- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్‌లో పండ్ల వ్యాపారిని ఓటు అడుగుతున్న రాజగోపాల్‌రెడ్డి, అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం : ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ కులం, మతం సెంటిమెంట్ తీసుకువస్తున్నాడని, ఆయన ప్రయత్నాలు పని చేయవని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. చౌటుప్పల్ పరిధిలోని తంగడపల్లి రోడ్డులో, సంస్థాన్‌నారాయణపురంలో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం పేరిట 2014లో ప్రజలు ఓటేశారని, ఇప్పుడు సిద్ధంగా లేరన్నారు. డాక్టర్‌గా బూర నర్సయ్యకు ఎంతో గౌరవం ఇస్తానని, ఆయనే తనపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామన్నారు.

కేసీఆర్ కొడుకు, అల్లుడూ జైలుకెళ్లక తప్పదు
కేసీఆర్ కొడుకు, అల్లుడు కూడా జైలుకు పోతారని రాజగోపాల్‌రెడ్డి జోస్యం చెప్పారు. కారు పూర్తిగా చెడిపోయిందని,స్క్రాప్‌కు వెళ్లడమే మిగిలిందన్నారు. మునుగోడు ప్రజలకు నా జీవితం అంకితమని, ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధమన్నారు. అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిపిస్తే ఇక్కడి సమస్యలపై ఢిల్లీలో పోరాటం చేసి నిధులు తీసుకువస్తానన్నారు. అంతకుముందు చౌటుప్పల్‌లో వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. చౌటుప్పల్ రోడ్ షోలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, బ్లాక్, మున్సిపల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, బోయ దేవేందర్, నారాయణపురంలో సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెలకంటి సత్యం, కాంగ్రెస్ నాయకుడు పున్న కైలాష్‌నేత, ఎంపీపీ గుత్త ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, గుత్తా ప్రేమ్‌చందర్‌రెడ్డి, పార్టీ సంస్థాన్‌నారాయణపురం మండల అధ్యక్షుడు ఏపూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సంస్థాన్‌నారాయణపురంలో నిర్వహించిన రోడ్ షోకు హాజరైన జనం

రాత్రి 9 దాటితే బస్సులు బంద్

భువనగిరి బస్టాండ్‌కు రాని సర్వీసులు

- నేరుగా బైపాస్ నుంచే రాకపోకలు
- హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు
- నల్లగొండ, మెదక్‌వైపు వెళ్లాలన్నా అవస్థలే



భువనగిరి ఆర్టీసీ బస్టాండ్

భువనగిరి : జిల్లా కేంద్రమైన భువనగిరి బస్టాండ్ నుంచి రాత్రి తొమ్మిది గంటల తర్వాత ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి 9 దాటితే ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులు ఉండడం లేదు. వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన వారు తిరిగి రావాలన్నా, భువనగిరి నుంచి నల్లగొండ, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా స్పందించలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

నిత్యం వేలాది మంది ప్రయాణం
హైదరాబాద్– వరంగల్ ప్రధాన రహదారి మార్గంలో ఉన్న భువనగిరి పట్టణం నుంచి వేలాది మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లాలకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వెళ్లంటారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన వందలాది బస్సులు భువనగిరి మీదగా వెళ్తుంటాయి. కానీ, ఇందులో కొన్ని మాత్రమే భువనగిరి బస్టాండ్‌కు వస్తుంటాయి.

బైపాస్ నుంచి..
భువనగిరి పట్టణం నుంచి ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, ఇతర వర్గాల ప్రజలు హైదరాబాద్‌తో పాటు మెదక్, నల్లగొండ తదితర ప్రాంతాలకు రోజూ వెళ్లొస్తుంటారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్, కరీంనగర్ వెళ్లే బస్సులు రాత్రి 8 దాటితే భువనగిరికి వెళ్లే ప్రయాణికులకు తీసుకెళ్లడం లేదు. ఒక వేళ బస్సు ఎక్కినా భువనగిరి పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డు మార్గంలో గల టీచర్స్ కాలనీ లేదా రాయగిరి వద్ద అపుతున్నారు. దీంతో అర్ధరాత్రి సమయంలో భువనగిరికి రావాలంటే ఆటోలు లేదా 3 కిలో మీటర్ల దూరం నడుచుకుంటూ వస్తున్నారు.ఈ సమయంలో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రాత్రి 9 దాటితే నల్లగొండ, మెదక్ వైపునకు వెళ్లేందుకు బస్సులు ఉండవు. భువనగిరి నుంచి నల్లగొండ, మెదక్ వైపు రాత్రి 10 గంటల వరకు బస్సులు నడపాలని, హైదరాబాద్ నుంచి జాతీయ రహదారిగా మీదుగా వెళ్లే బస్సులను రాత్రి 10 గంటల వరకు భువనగిరి బస్టాండ్‌కు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రాత్రి 9 దాటిన తర్వాత భువనగిరి బస్టాండ్ నుంచి నల్లగొండ, మెదక్ జిల్లాల వైపునకు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశాం. అయినా వారినుంచి స్పందన లేదు. మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించిన తర్వాత బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. కానీ, బస్సుల వేళలు అదే విధంగా ఉన్నాయి. ఇప్పటికైన రాత్రి సమయంలో బస్సులు నడపాలి.

–లావణ్య, భువనగిరి

ఇబ్బంది పడుతున్నాం



హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సులు రాత్రి 9 దాటితే భువనగిరి బస్టాండ్‌కు రావడం లేదు. నేరుగా బైపాస్ నుంచి పోతున్నాయి. దీంతో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి 10 గంటల వరకు భువనగిరి బస్టాండ్‌కు బస్సులు వచ్చివెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కర్నాల శ్రీనివాస్, భువనగిరి

9 గంటలకు చివరి బస్సు ఉంటుంది



భువనగిరి బస్టాండ్ నుంచి రాత్రి 9 గంటలకు చివరి బస్సు ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి భువనగిరికి వచ్చి నల్లగొండ మార్గంలో ఉన్న ప్రాంతాలకు వెళ్లేందుకు రాత్రి 9 దాటితే బస్సులు ఉండటం లేదు. ఈ సమయంలో ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులోకి ఇబ్బంది పడాల్సి వస్తోంది. రాత్రి సమయంలో కూడా బస్సులు ఏర్పాటు చేయాలి.

–కదారి వెంకటేశం, భువనగిరి

లగ్జరీ సర్వీసులు కూడా ఆపాలి



పగటి వేళ్ల మాత్రమే కొన్ని లగ్జరీ బస్సులు భువనగిరి బస్టాండ్‌కు వచ్చి వెళ్తుంటాయి. రాత్రి 9 దాటితే లగ్జరీ బస్సులు బస్టాండ్‌కు రావు. నేరుగా బైపాస్‌నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో దూర ప్రయాణం చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 10 గంటల వరకు బస్టాండ్‌కు లగ్జరీ బస్సులు కూడా వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–తాడూరి కిష్టయ్య, భువనగిరి

బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ

- సొంత ఎమ్మెల్యేలను చామల బ్లాక్‌మెయిల్ చేస్తుండు
- కోమటిరెడ్డి సోదరులను మునగ చెట్టు ఎక్కించిన రేవంత్‌రెడ్డి
- బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



విలేకర్లతో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోకసభ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉంటుందని బీజేపీ అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. గురువారం భువనగిరిలోని వివేరా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ గల్లీలో లేదు, కాంగ్రెస్ ఢిల్లీలో లేదన్నారు. ఢిల్లీలో మోదీ ఉండాలంటే భువనగిరిలో బీజేపీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తాను సీఎంకు దగ్గర, అన్నీ మీరే చూసుకోవాలని సొంత పార్టీ ఎమ్మెల్యేలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆరోపించారు. 30 ఏళ్లుగా ప్రజలకు ఏం సేవ చేశాడో చెప్పాలని.. రాహుల్‌గాంధీ సంతకం ఫోర్జరీ చేయడం, క్యాసినోలు నడపడం, వ్యాపారాలు చేయడమే అయన పనా? అని ప్రశ్నించారు. ప్రజలకు ఏం చేస్తాడో ప్రచారంలో ఎక్కడా చెప్పడం లేదన్నారు. కోమటిరెడ్డి సోదరులను సీఎం రేవంత్‌రెడ్డి మునగ చెట్టు ఎక్కించారని, ఒకరిని సీఎం, మరొకరిని హోంమంత్రి అంటూ మభ్యపెట్టారని పేర్కొన్నారు. భువనగిరి ఎంపీగా పని చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఏచిన్న ప్రాజెక్టు అయినా తెచ్చాడా అని ప్రశ్నించారు. తనను ఎంపీగా గెలిపిస్తే భువనగిరిని యోజకవర్గానికి రూ.9 వేల కోట్ల నిధులు తెచ్చానని గుర్తు చేశారు.

దేశాన్ని అప్రతిష్టపాలు చేసింది కాంగ్రెస్సే : కాసం
దేశాన్ని అప్రతిష్టపాలు చేసింది కాంగ్రెస్సేనని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్నికల తర్వాత తన పదవి పోతుందన్న భయంతో మోదీ, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ కంటే బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. సమావేశంలో బీజేపీ జనగామ, యాదాద్రి జిల్లాల అధ్యక్షులు దేశమంత్‌రెడ్డి, పాశం భాస్కర్, నాయకులు చాడ సురేష్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, కడియం రామచంద్రయ్య, దయానంద్‌గౌడ్, మొగులయ్య, బందారపు లింగస్వామి, చందామహేందర్ గుప్తా పాల్గొన్నారు.

తొలిరోజు ముగ్గురు 'పట్టభద్రులు'

వరంగల్– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు గురువారం తొలిరోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య నామినేషన్లు వేశారు. ముగ్గురు అభ్యర్థులు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన తెలిపారు.

–నల్లగొండ:


తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తున్న నందిపాటి జానయ్య


ప్రజావాణి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న పాటి శ్రీకాంత్‌రెడ్డి


స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న బండారు నాగరాజు

ఎన్నికల సిబ్బందికి వసతులు కల్పించాలి

నకిరేకల్: లోక్‌సభ ఎన్నికల శిక్షణ, పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి సరైన వసతులు కల్పించాలని, రెమ్యూనరేషన్‌లో తేడాలు సవరించాలని కోరుతూ నకిరేకల్‌లోని గురుకుల పాఠశాలలో ఎన్నికల శిక్షణకు హాజరైన పీఓలు, ఏపీఓలు, ఇతర సిబ్బంది గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు పూటలా శిక్షణ నిర్వహిస్తున్నప్పటికీ లంచ్, స్నాక్స్ కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. రెమ్యూనరేషన్ విషయంలో ఇతర జిల్లాల సిబ్బందితో పోల్చితే తేడాలు ఉన్నాయని, వాటిని సవరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చందులాల్, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, ఫాతీమామేరీ తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

నల్లగొండ: జిల్లా కేంద్రం సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఎఫ్‌సీఐ గోదాంలలో ఏర్పాటు చేయనున్న లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని గురువారం జిల్లా ఎన్నికల పరిశీలకులు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, కళ్యాణ్ కుమార్ దాస్, అమోగ్ జీవన్ గాంకర్ తనిఖీ చేశారు. బారికేడింగ్, స్ట్రాంగ్‌రూం, ఓట్ల లెక్కింపు హాళ్లలో సౌకర్యాలు, ఓట్ల లెక్కింపునకు వినియోగించనున్న టేబుళ్లు, సీసీ కెమెరాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, పీఆర్ ఈఈ భూమయ్య, డీఈ నాగయ్య, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, ఎస్పీ

ఈవీఎంల తనిఖీ

కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంలో ఉన్న ఈవీఎంలను జిల్లా ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ గురువారం పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన, పార్లమెంట్ నియోజకవర్గ డిప్యూటీ రిటర్నింగ్ అధికారి నటరాజ్, ఈవీఎంల ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఓట్ల వేటకు ఎండ దెబ్బ!

- లోక్‌సభ ఎన్నికల ప్రచారంపై భానుడి ప్రతాపం
- ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించేందుకు కార్యకర్తల ఆపసోపాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రచారంలోకి కేడర్
- సభలు, సమావేశాలకే పరిమితమైన అభ్యర్థులు



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. పోలింగ్‌కు మరో 10 రోజులే గడువు ఉండగా.. అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. అయితే ఆయా పార్టీలు, అభ్యర్థులు చేస్తున్న ఓట్ల వేటపై భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 10గంటలు దాటితే ఎండ భగ్గుమంటోంది. సాయంత్రం 6 గంటలు అయినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. రెండు రోజుల నుంచి జిల్లా రెడ్‌జోన్‌లోకి వెళ్లడంతో అన్ని పార్టీల కార్యకర్తలు, నాయకులు ప్రచారానికి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు.

ఇంటింటికీ వెళ్లేందుకు ఆపసోపాలు

సూర్యాపేట జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలను గెలవడం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చావోరేవోగా మారింది. ఇప్పటికే ఈ రెండు పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉండగా వాటిని నిలుపుకోవాలన్న పట్టుదలతో ఉంది. రాష్ట్రంలో అధికారం చేజారడంతో.. లెక్కలను సరిచేసేందుకు బీఆర్ఎస్ ఎలాగైనా ఈ రెండు స్థానాలను గెలవాలన్న కసితో పనిచేస్తోంది. ఇక ఇప్పటి వరకు నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో గెలవని బీజేపీ ప్రధాని మోదీ మ్యాజిక్‌తో ఖాతా తెరవాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల కేడర్ ప్రజల వద్దకు వెళ్లి తమ పార్టీల మేనిఫెస్టోలను వివరిస్తోంది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 1201 పోలింగ్ కేంద్రాల్లో లక్షా 12 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరందరినీ కలిసేలా అభ్యర్థులు, ఆయా పార్టీల మొదటి శ్రేణి నాయకత్వం ప్రణాళికలు వేసినా.. ఎండ దెబ్బకు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు వారి వెంట నడిచేందుకు రాలేకపోతున్నారు.

ఎండలో తిరిగేందుకు ఆసక్తి చూపని కేడర్

ప్రస్తుతం ఓటర్లను నేరుగా కలిసి ప్రసన్నం చేసుకుంటేనే గాని ఓట్లు రాని పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో ప్రతి ఓటరును కలుసుకోవడం అభ్యర్థులకు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో తమ గుర్తునైనా ప్రజల వద్దకు చేర్చాలనే ఉద్దేశంతో అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం తమ పార్టీ ద్వితీయ శ్రేణి, ఆ కింది స్థాయి నాయకత్వానికి దిశానిర్దేశం చేసేందుకు మండలాల వారీగా ప్రధాన పార్టీలు సమావేశాలు, సభలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక ప్రచార రథాలతో గల్లీగల్లీ తిరిగేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వారం, పదిరోజులుగా జిల్లాలో భానుడు భగ్గుమనడం, మరి మూడు రోజులుగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుండడంతో ఎండలో తిరిగేందుకు కేడర్ అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో జోష్ కనిపించడం లేదు. మరో నాలుగైదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతుండడం, ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీల్లో ఆందోళన నెలకొంది.

కీలకంగా వ్యవహరించాలి


అభివాదం చేస్తున్న బల్మూరి వెంకట్, చామల, తీన్మార్ మల్లన్న తదితరులు

భువనగిరిటౌన్: లోకసభ ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ శ్రేణులు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలోనే యువతకు అధిక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న), రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుర చందనరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, నేషనల్ డెలిగేట్ ఎడమ పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో పారదర్శకత పెంచిన ఆర్‌టీఐ

- మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు


చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని సభలో పరిచయం చేస్తున్న వర్రె వెంకటేశ్వర్లు

చౌటుప్పల్: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సమాజంలో పారదర్శకతను పెంచిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి షాదీఖాన భవనంలో సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించేలా ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి జీఓ ఆన్‌లైన్‌లో ఉంచుతామని, ఆర్‌టీఐ దరఖాస్తులను సైతం ఆన్‌లైన్‌లో తీసుకునేలా చర్యలు తీసుకుంటామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన నాయకత్వంలో అత్యధిక ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాన్యుడికి సైతం గౌరవం దక్కేలా కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకువస్తే కేంద్రంలోని బీజేపీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు పారదర్శకంగా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖుర్షీద్‌పాషా, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, జెడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ రిటైర్డ్ ఇన్ చీఫ్ ఎంఏ.కరీం, ప్రతినిధులు పాల్గొన్నారు.

మోదీ, కేసీఆర్ మాటలు ప్రజలు నమ్మరు

- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి జానారెడ్డి, వేనేపల్లి చందర్‌రావు

కోదాడరూరల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ సీఎం కేసీఆర్ చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కోదాడ పట్టణంలోని ఓ కల్యాణమండపంలో కోదాడ పట్టణ, రూరల్, అనంతగిరి మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం చేపట్టిన రోడ్ షోలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల పాలనలో మోదీ దేశాన్ని, కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా నాశనం చేశారని విమర్శించారు. మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయంతో ఇండియా కూటమి కేంద్రంలో అధికారం చేపట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచేది నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పీసీసీ సభ్యుడు సీహెచ్. లక్ష్మీనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీలు మందలపు కృష్ణకుమారి, కొణతం ఉమ, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు వంగవీటి రామారావు, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ సమయం గంట పొడిగింపు

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ సమయాన్ని అదనంగా గంట పాటు పొడిగిస్తూ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను ఈ నెల 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్‌లో ప్రకటించినప్పటికీ.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6గంటల వరకు పెంచుతూ ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

తుర్కపల్లి: మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలంలోని మాదాపూర్, వీరారెడ్డిపల్లి, దత్తాయపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై మూడు నెలల్లోనే ప్రజలకు విశ్వాసం పోయిందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో చెరువులన్నీ నిండుకుండలా ఉండేవని, గ్రామాల్లో ఎటుచూసినా ధాన్యం రాసులు దర్శనమిచ్చేవన్నారు. కాంగ్రెస్ పాలనలో చెరువులన్నీ అడుగంటి, పంట పొలాలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని అన్నారు. ప్రచారంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న బూతు పురాణం ఎన్నికల కమిషన్‌కు కనబడటం లేదని విమర్శించారు. కార్యకర్తలు ఓటర్లను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను వివరించి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, సూదగాని హరిశంకర్‌గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బీకునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నగదు పట్టివేత

వలిగొండ : ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో మండలంలోని పులిగిల్లకు చెందిన కొమ్మిడి వెంకట్‌రెడ్డి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షా 66వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి నగదు ట్రెజరరీకి తరలించినట్లు స్థానిక ఎస్ఐ మహేందర్ తెలిపారు.

WANTED కోదాడలోని ప్రముఖ N.R.S. I.I.T & Medical Academy లో పనిచేయుటకు వివిధ సబ్జెక్టుల వారిగా అర్హత కలిగిన లెక్చరర్లు, రిసెప్షనిస్టు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, వార్డెన్‌లు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు కోదాడ పట్టణంలోని నలంద స్ట్రీట్‌లో గల కాలేజ్ కార్యాలయంలో తమ అర్హతల వివరాలతో సంప్రదించగలరు.
ఖాళీల వివరాలు : 1): ఫిజిక్స్ (ఎంసెట్ బోధించుటకు) 2) కెమిస్ట్రీ (ఎంసెట్ బోధించుటకు) 3) ఫిజిక్స్ (జూనియర్ లెక్చరర్) 4) కెమిస్ట్రీ (జూనియర్ లెక్చరర్) 5) మ్యాథమెటిక్స్ (జూనియర్ లెక్చరర్) 6) బాయ్స్ హాస్టల్ వార్డెన్ 7) కంప్యూటర్ ఆపరేటర్ 8) రిసెప్షనిస్ట్
మరిన్ని వివరాలకు : 9515000346, 9515000347, 9515000348 నెంబర్లలో సంప్రదించగలరు.
NRS Junior College IIT & Medical Academy
Opp. Dr. Suryanarayana Gari Hospital, Nalanda Street, Kodad - 508 206

WANTED TEACHERS
Wanted experienced trained teachers to teach All Subjects for pre-primary, primary, High School, IIT Foundation Classes, P.E.T, Computer and Lady Warden.
Candidates willing to apply must have good communication skills and must be fluent in English. Interested Candidates can submit their resumes at our school.
Interview and Demonstration Date : 05/05/2024
SRI ADITYA HIGH SCHOOL (EM)
Nursery to X
Aditya Nagar, Near New Collectorate, NALGONDA.
Cell : 89859 25612, 89859 25613

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ Medical coding / Billing training and placement opportunity for any Graduates (B.sc, B.com, B.Tech, Nursing etc. B.Pharmacy) working Place Nalgonda town, (Preferred Local candidates and nearby). Ph.9032051322 / 9441638343 Email ID: mahathi.hr1@gmail.com [YA-2768]

■ సమ్మర్ జాబ్స్: నల్గొండ జిల్లాలోని మా సంస్థలో జాబ్ చేయడానికి 39 స్త్రీ/పు కావలెను. Q: 10th, ఇంటర్, డిగ్రీ(P/F), జీతం: 14వేలు+6వేలు DA+ఫ్రీ రూం, భోజనం. సెల్: 8519891505. [L-795771]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185061]

Real Estate

PLOT FOR SALE

■ సాగర్ రోడ్‌లో గల రెయిన్‌బో వెంచర్ ఫేస్-2 నందు 300 చ॥గల తూర్పు ఫేస్ ప్లాటు అమ్మబడును. గజం 5500/-రూ॥లు సంప్ర॥ 9885650635, 6281714883 [Y-798445]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రెసిడెన్షియల్ సూట్‌లోని విడిదిలో మాంసాహార భోజనం

- ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించారని భక్తుల మండిపాటు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రెసిడెన్షియల్ సూట్ విల్లాలో ఉండే దివ్య ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. దేవస్థానం నిబంధనల మేరకు ప్రెసిడెన్షియల్ సూట్ పరిసర ప్రాంతాల్లో మాంసాహార భోజనం నిషేధం. కానీ ఉపాధ్యాయ నేత దాచూరి రామిరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి వచ్చిన ప్రముఖులు, ఉపాధ్యాయులకు మాంసాహార భోజనం ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించారని భక్తులు మండిపడుతున్నారు. ఈ విషయమై ప్రెసిడెన్షియల్ సూట్ నిర్వాహకులను అడగగా.. ఆడిటోరియంను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్నట్లు తెలిపారు. మాంసాహారం భోజనం ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపడతామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ వైద్యుడు మృతి

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందాడు. రాయగిరి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ గుమ్మడి రాజు (48) భువనగిరి నుంచి రాయగిరి వెళ్తుండగా.. పాల సెంటర్ సమీపంలో బస్సును ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

గుండాల : తాళం వేసిన ఉన్న ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఊట్ల వీరేషం దంపతులు ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, వెండి పట్టా గొలుసులతో పాటు రూ.20వేల నగదును, అదే విధంగా తవిటి సోమక్క ఇంట్లో రూ.4,200నగదు, అన్నోజు సత్తయ్య ఇంట్లో వెండి పట్టా గొలుసులతో పాటు రూ.2వేల నగదు, గవ్వల చంద్రమ్మ ఇంట్లో రూ.4వేల నగదు, అన్నోజు నర్సింహాచారి ఇంటి తాళాలు పగులగొట్టినట్లు బాధితులు వాపోయారు. గురువారం బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించినట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

ఆన్‌లైన్ మోసంతో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి

భువనగిరి క్రైం : మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన ఊశికె వెంకట్‌రెడ్డి ఆన్‌లైన్ మోసాలతో రూ.లక్షా నాలుగు వేలు పోగొట్టుకున్నాడు. గురువారం రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనాజిపురం గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి మొబైల్‌కు 81441 60090 నంబర్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు క్రెడిట్ కార్డు వస్తుందని కెనరా బ్యాంకుకు సంబంధించిన క్రెడిట్‌కార్డు లింకు పంపారు. వెంకట్‌రెడ్డి లింక్ ఓపెన్ చేశాడు. ఓపెన్ చేయగానే అతడి బ్యాంక్ అకౌంట్ నుంచి వరుసగా రూ.44వేలు, రూ.50వేలు, రూ.10వేల చొప్పున వెళ్లినట్లు మెసేజ్ రావడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

వలిగొండ: బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన వలిగొండ మండల పరిధిలోని నాగారం గ్రామ రైల్వే గేట్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పులిగిల్ల గ్రామానికి చెందిన బుగ్గ మధు నెమిలకాల్వ గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో నాగారం గ్రామ రైల్వే గేట్ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, వాహన దారులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిప్పంటుకుని మామిడిచెట్లు దగ్ధం

వలిగొండ : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని 150మామిడిచెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఆరూర్ మధిర అప్పారెడ్డిపల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తుమ్మల రవీందర్‌రెడ్డి వ్యవసాయ భూమి పక్క ఉన్న ఓ రైతు పొలంలో నుంచి మంటలు వ్యాపించి రవీందర్‌రెడ్డి మామిడిచెట్లకు అంటుకున్నాయి. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే 150మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.లక్షా50వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని నెమిలికాలువ గ్రామానికి చెందిన కొండ మల్లేష్(58) తన ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామశివారులోని రహదారిపై వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేష్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు ప్రదీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని..

- భర్త ఇంటి ఎదుట దీక్ష


భర్త ఇంటి ఎదుట దీక్ష చేస్తున్న నాగమణి, ఆమె కుటుంబ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి: మూడేళ్లు ప్రేమించుకున్నారు. పెళ్లి కూడా చేసుకున్నారు. అనంతరం ఆమెను కాపురానికి తీసుకెళ్లకుండా భర్త ముఖం చాటేశాడు. దీంతో యువతి తనకు న్యాయం చేయాలని గురువారం అత్తగారింటి ఎదుట దీక్ష చేపట్టింది. ఈ సంఘటన గురువారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన బోళ్ల నాగమణి(21) రెండేళ్ల క్రితం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో కంప్యూటర్ కోర్సు నేర్చుకునేందుకు వచ్చింది. అదే సమయంలో కప్రాయిపల్లి గ్రామానికి చెందిన గంగదేవి సాయి(22) ఇదే సంస్థలో స్వయం ఉపాధి కోర్సు నేర్చుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మూడేళ్లు ప్రేమించుకున్నారు. ఈ ఏడాది జనవరి 21న తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి శ్రీశైలం పుణ్యక్షేత్రంలో పెళ్లి చేసుకున్నారు.

రెండు నెలల తరువాత తీసుకెళ్తామని చెప్పి..

రెండు రోజుల్లో తన కుమార్తెది ఎంగేజ్‌మెంట్ ఉందని, రెండు నెలల తరువాత సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసి కాపురానికి తీసుకెళ్తామని గంగదేవి సాయి తండ్రి సత్యనారాయణ నాగమణి తల్లిదండ్రులకు నచ్చజెప్పాడు. పెద్దల సమక్షంలో కూడా లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడు. కానీ రెండు నెలలు గడిచినా కాపురానికి తీసుకెళ్లకపోవడంతో నాగమణి తన భర్త సాయికి ఫోన్ చేసింది. అయినా వారు స్పందించకపోవడంతో ఇటీవల భువనగిరి మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు ఇరువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. నాగమణి తనకు వద్దని సాయి తెగేసి చెప్పాడు. ఇక గత్యంతరంలేక గురువారం నాగమణి, తన తల్లిదండ్రులతో కలిసి కప్రాయిపల్లికి వచ్చింది. విషయం తెలుసుకున్న సాయి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. యువతి ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటి ఎదుటే కూర్చుని దీక్ష చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటానని తేల్చి చెప్పింది.

హోరాహోరీగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


సెమీ ఫైనల్‌కు చేరుకున్న క్రీడాకారులు..

భువనగిరి : పట్టణంలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పోటీల్లో భాగంగా గురువారం క్వార్టర్ ఫైనల్ జరిగాయి. శుక్రవారం సెమి ఫైనల్‌తో పాటు శనివారం ఫైనల్ పోటీలు జరగనున్నాయి.ఈ పోటీల్లో బాలికల విభాగంలో నలుగురు, బాలుర విభాగంలో నలుగురు తలపడనున్నారు. అండర్–14 బాలుర సింగిల్ విభాగంలో ఫజల్ అలీమీర్(తమిళనాడు), అథర్వ శ్రీరామోజు(తెలంగాణ), వనిజ్ ఆర్యన్(తెలంగాణ), ప్రణీత్‌రెడ్డి(తెలంగాణ). అండర్–14 బాలిల సింగిల్ విభాగంలో కిరణ్ (కర్నాటక), దీప్తి వెంకటేషన్(తమిళనాడు), షిజానిగుప్త(మహారాష్ట్ర), శ్రావీ డియోరే(మహారాష్ట్ర) సెమీ ఫైనల్‌కు చేరుకున్న వారిలో ఉన్నారు.